# ముఖ్యమంత్రి కార్యాలయము

## తెలంగాణ ప్రభుత్వం

పత్రికా ప్రకటన-1 29, నవంబరు, 2014

తెలంగాణలోని నిరుపేద పిల్లలంతా కూడా ఇంగ్లీషు మీడియంలో మంచి చదువులు చదవాలన్నదే తన లక్ష్యమని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు అన్నారు. కేజి నుండి పిజి వరకు పిల్లలకు మంచి విద్యను అందించడం కోసం అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి అధికారులును ఆదేశించారు. తెలంగాణలో అనుసరించాల్సిన విద్యా విధానం పై సచివాలయంలో శనివారం సమీక్ష నిర్వహించారు. విద్యా శాఖ మంత్రి జగదీశ్ రెడ్డి, సీనియర్ అధికారులు మీనా, శైలజ, ప్రదీప్‌చంద్ర, జయేష్ రంజన్, సోమేష్‌కుమార్, నర్సింగరావు, శ్రీధర్, స్మితా సబర్వాల్ తదితరులు పాల్గొన్నారు. ప్రస్తుతం అంగన్‌వాడి కేంద్రాలలో పిల్లలకు పోషకాహారం, ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్ అందుతోందని, వాటిని ప్లే స్కూల్లుగా మార్చాలని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ప్రాథమిక స్థాయినుండే పిల్లలకు ఇంగ్లీషు మీడియంలో విద్యా బోధన జరగాల్సి ఉందన్నారు. డబ్బులు ఉన్నవారు తమ పిల్లలకు ఇంగ్లీషు మీడియం విద్య అందించగలుగుతున్నారని, స్టాండర్డ్ స్కూల్లలో చదివించగలుగుతున్నారని, కాని పేదలకు ఆ భాగ్యం లేకుండా పోయిందన్నారు. పేద పిల్లలు చదివే ప్రభుత్వ పాఠశాలలు సరిగా నడవడం లేదని అభిప్రాయపడ్డారు. ఈ పేదలే సరైన విద్య అందక భవిష్యత్తులో నిరుపయోగమైన తరంగా మారుతారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎట్టి పరిస్థితుల్లో పేదలను నిర్లక్ష్యం చేయవద్దని చెప్పారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే రెసిడెన్షియల్ పాఠశాలలు బాగానే నడుస్తున్నాయని, అదే తరహాలో ఇంకా రెసిడెన్షియల్ పాఠశాలల సంఖ్యను పెంచాలని నిర్ణయించారు. పేదలు, ధనవంతులు అనే తేడా లేకుండా పిల్లలందరూ ఒకే స్కూల్‌లో నాణ్యమైన విద్యను ఇంగ్లీషు మీడియంలో అభ్యసించేలా విద్యా విధానం రూపొందించాలని చెప్పారు. ఐఎఎస్ ఆఫీసర్

పిల్లలు, ఎమ్మెల్యే పిల్లలు, నిరుపేద పిల్లలు ఒకే స్కూల్‌లో చదవాలని, ఒకే రకం యూనిఫాం వేసుకోవాలని, ఒకే రకమయిన విద్య ఉండాలని ముఖ్యమంత్రి అన్నారు. మండలానికి రెండు మూడు చొప్పున రెసిడెన్షియల్ పాఠశాలలు ఏర్పాటు చేసి, అందులోనే 12వ తరగతి వరకు అందరికి విద్యను అందించాలనే ప్రతిపాదనపై చర్చ జరిగింది. ఈ సమీక్షలో నిర్బంధ విద్య అమలుపై పలు రకాల ప్రతిపాదనలు చర్చకు వచ్చాయి.

<u>ప్రతిపాదన నంబర్ 1ః</u> – 4వ తరగతి నుండి రెసిడెన్షియల్ పాఠశాలలు ప్రారంభించి ఒక్కో ఏడాది ఒక్కో తరగతి పెంచుకుంటూ పోవాలి.

<u>ప్రతిపాదన నంబర్ 2 ః</u>– 5వ తరగతి నుండి 8వ తరగతి వరకు ఇంగ్లీషు మీడియంలో రెసిడెనన్షియల్ పాఠశాలలు ప్రారంభించాలి.

<u>ప్రతిపాదన నంబర్ 3 ః</u>– ప్రస్తుతం మండలానికి మూడు నాలుగు పాఠశాలల్లో ఇంగ్లిషు మీడియం విద్యా బోధన జరుగుతుంది. ఇదే తరహాలో అన్ని పాఠశాలల్లో ఇంగ్లిషు మీడియాన్ని ప్రవేశపెట్టడం.

<u>ప్రతిపాదన నంబర్ 4 ః</u>– రెసిడెన్షియల్ పాఠశాలలు మండలానికి మూడు నాలుగు పెట్టాలి, మండలానికి ఒకటి సరిపోతుంది.

<u>ప్రతిపాదన నంబర్ 5 ః</u>– తెలుగు మీడియం విద్యార్థులను ఇంగ్లీషు మీడియంలోకి మార్చి, మొదటి సంవత్సరంలో ఇంగ్లీషు భాష నేర్పడంపై దృష్టి పెట్టాలి. ఉపాధ్యాయులు కూడా ఇంగ్లీషు మీడియంలో భోదించేందుకు సన్నద్ధం కావాలి.

ఇలా రకరకాల ప్రతిపాదనలపై చర్చ జరిగినా, తుది నిర్ణయం తీసుకోలేదు. విద్యా రంగంలో అనుభవజ్ఞులు, మేధావులు, సీనియర్ అధికారులతో త్వరలోనే ఓ వర్క్‌షాపు నిర్వహించి తెలంగాణలో విద్యా విధానంపై విస్తృతంగా చర్చించాలని నిర్ణయించారు.

తెలంగాణలోని అన్ని హాస్టల్లలో విద్యార్థులకు మేలు రకమయిన సన్న బియ్యాన్ని అందించాలని చెప్పారు. ఇప్పటి పిల్లలే రేపటి తెలంగాణ రాష్ట్రాన్ని నడపాలి కాబట్టి వారిని

నిర్లక్ష్యం చేయవద్దన్నారు.  హాస్టల్లలో దొడ్డు బియ్యం, పురుగుల అన్నం, నీళ్ల చారు ఉండటానికి వీల్లేదని స్పష్టం చేశారు.  ఎవరూ అడగక పోయినా హాస్టల్లలో చదువుకునే నిరుపేద పిల్లల కోసం తాను ఈ నిర్ణయం తీసుకున్నానని, పేద పిల్లలు ఎదగాలన్నదే తన కల అని ముఖ్యమంత్రి చెప్పారు.

ఇంజనీరింగ్ చదివే విద్యార్థులకు చదువులో ఉండగానే వృత్తి నైపుణ్యం పెంచాలని సిఎం చెప్పారు.  ఇంజనీరింగ్ విద్యార్థులను పరిశ్రమలకు అప్పగించాలని, అక్కడ తాము చదివే చదువు ద్వారా సాధించే పనులపై అవగాహన పెంచుకోవడం సాధ్యమవుతుందని ముఖ్యమంత్రి వెల్లడించారు.

-----------------------------------------------------------

సిపిఆర్ఓ టు సిఎం